సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 19 । అక్టోబర్ । 2024

ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా విజయసాయి రెడ్డి




వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డిని నియమించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అధిష్టానం నియామక ప్రకటనను శుక్రవారం రాత్రి విడుదల చేసింది. గతంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పనిచేసిన అనుభవంతో పాటు అందరికీ సుపరిచితుడు కావడంతో పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా పనిచేసిన ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ఉమ్మడి చిత్తూరు, గుంటూరు జిల్లాలరీజనల్ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. శాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణను ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమించారు. -సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

మందుబాబులపై కేసు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలాస కేటీ రోడ్డులో బహిరంగంగా మద్యం తాగుతున్న యువకులను కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం సాయంత్రం బహిరంగంగా మందు తాగుతున్న నలుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. అలాగే పలాస పట్టణంలో 1వ వార్డు మొగిలిపాడు సమీపంలో యువకుడు మద్యం సేవించి మోటారు వాహనం నడుపుతుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు.

న్యూస్‌రీల్

స్వాభిమాన్‌కు 31 వినతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగులు ఎందులోనూ తీసిపోరని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ప్రతి నెల మూడో శుక్రవారం స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలో వివిధ మండలాల నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కవితతో కలిసి వినతులు స్వీకరించారు. మొత్తం 31 వినతులు వచ్చాయి.

సిక్కోలు సంబరాలు చేద్దాం: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రహదారులు, భవనాల గ్రౌండ్ (డచ్ బిల్డింగ్)లో దీపావళి సంబరాలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యాటక మండలిపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సిక్కోలు సంబరాలు చేద్దామన్నారు. ఫుడ్ ఫెస్టివల్ కూడా ఏర్పాటు చేద్దామని పిలుపునిచ్చారు. ముందుగా రెండు లేదా మూడు రోజుల పాటు ఏర్పాటు చేద్దామని, ప్రజల స్పందన చూసి ఫెస్టివల్ పొడిగింపు ఉంటుందని చెప్పారు. జిల్లాలో గల టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని, సర్క్యూట్‌లో బస్సులు నడపాలని సూచించారు. కాఫీ టేబుల్ బుక్ తయారు చేయాలని ఆర్డీని ఆదేశించారు. పర్యాటక శాఖ ఆర్డీ పి.శ్రీనివాసరావు విజయ ఆదిత్య సాగర్ పార్క్‌లో పనులు జరుగుతున్నట్లు వివరించగా చుట్టూ ఫెన్సింగ్ (బౌండరీ) వేయాలని ఆదేశించారు. వజ్రపుకొత్తూరు మండలంలోని శివ సాగర్ బీచ్ వద్ద సమస్యలు లేకుండా చూడాలని అక్కడి తహసీల్దార్‌ను ఆదేశించారు. హిరమండలం వద్ద గల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో వాటర్ స్పోర్ట్స్ గురించి ఆరా తీశారు. వజ్రపుకొత్తూరు మండలం పూడిలంక బీచ్ వద్ద ఐలాండ్, మెట్టూరులోని వొంకులూరు బీచ్‌లో ఎర్రమట్టి దిబ్బలు, ఇతర ప్రాజెక్టులు, గ్రామీణ పర్యాటకం, తదితర వాటిపై చర్చించారు.

తుఫాను ప్రభావిత మండలాలకు ప్రత్యేక అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: తుఫాను ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలోని 11 తీర ప్రాంత మండలాలకు ప్రత్యేక పర్యవేక్షక అధికారులను నియమిస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు జారీ చేశారు. వీరంతా ఆయా తీర ప్రాంత మండలాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అప్రమత్తం చేశారు.

- రణస్థలానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, పి.కిరణ్ కుమార్ (ఫోన్ : 8008803800).
- ఎచ్చెర్లకు డ్వామా పీడీ, బి.సుధాకర్ రావు (ఫోన్:8790008399).
- శ్రీకాకుళం జిల్లా పంచాయతీ అధికారి, కె.భారతి సౌజన్య (8341493877).
- గారకు ఐసీడీఎస్ పీడీ, బి.శాంతి శ్రీ (9440814582).
- పోలాకికి జిల్లా పరిషత్ సీఈఓ, శ్రీధర్ రాజు రామన్ (9100997770),
- సంతబొమ్మాళికి జిల్లా పరిశ్రమల శాఖ, జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు (9866530885)
- వజ్రపుకొత్తూరుకు మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్, పీవీ శ్రీనివాసరావు (9440716028).
- సోంపేటకు కార్మిక శాఖ సహాయ కమిషనర్, అజయ్ కార్తికేయ (9492555034).
- మందసకు పశుసంవర్ధక శాఖ పలాస సహాయ సంచాలకులు,పి చంద్రశేఖర్ (9492416700).
- కవిటికి ఉద్యాన శాఖాధికారి ఆర్వీవి ప్రసాద్ (7995086758).
- ఇచ్ఛాపురం మండలానికి డ్వామా ఏపీడీ సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి (6309998070).

విహంగాల హంగామా



అతిథి విహంగాలు తేలినీలాపురం చేరుకుంటున్నాయి. ఏటా సైబీరియా ప్రాంతం నుంచి పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షులు సెప్టెంబర్ నెలలో తేలినీలాపురం గ్రామంలో గల విదేశీ పక్షుల కేంద్రానికి చేరుకుని సమీపంలో చింత, తుమ్మ చెట్లపై ఆవాసాలను ఏర్పాటు చేసుకుని సంతానోత్పత్తి చేసుకుంటాయి. ఏప్రిల్ వరకు విదేశీ పక్షులు ఇక్కడే విడిది చేస్తాయి. ప్రస్తుతానికి సుమారు 150 వరకు పెలికాన్ పక్షులు విడిది కేంద్రానికి చేరుకున్నాయి. - టెక్కలి

నేను లోకేష్ తాలూకా..

అంతా తప్పకోండిక..!

- శ్రీకాకుళం కార్పొరేషన్‌లో తాడేపల్లి గూడెం వాసి హడావుడి
- రంగుల కాంట్రాక్ట్ తనదేనంటూ తీర్మానం
- టెండర్లు వేసిన కాంట్రాక్టర్లంతా తప్పకోవాలని హుకుం
- ఆ కాంట్రాక్టర్‌కు ఓ ఉన్నతాధికారి వత్తాసు



'నేను లోకేష్ మనిషిని. అమరావతి పెద్దల డైరెక్షన్ ఇది. నేను చెప్పేదే జరగాలి. కార్పొరేషన్‌లో రంగులు కాంట్రాక్ట్ నాదే. టెండర్లలో పాల్గొన్న కాంట్రాక్టర్లంతా తప్పకోవాలి. చెప్పింది చేయకపోతే ఇబ్బందులు పడతారు. తప్పకోకపోతే మిగతా కాంట్రాక్ట్ పనులు దక్కనీయకుండా చేస్తాను. ఇది నా ఆదేశం. చెప్పినట్టు చేయండి'

- శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో తాడేపల్లి గూడెం వాసి చేస్తున్న హడావుడి ఇది.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.కోటికి పైగా నిధుల రంగులు వేసే కాంట్రాక్ట్ కోసం తాడేపల్లి గూడెం వాసి నానా యాగీ చేస్తున్నారు. తాను లోకేష్ మనిషినని చెప్పుకుంటూ బెదిరిస్తున్నారు. పెద్దల డైరెక్షన్ మేరకు ఇప్పటికే రూ.25లక్షల పనులను నామినేటెడ్ పద్ధతిలో చేయగా, మరో రూ.78లక్షలకు పైగా విలువైన పనులను ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్లలో నేరుగా కొట్టేసేందుకు ప్లాన్ వేస్తున్నారు.

అడ్డగోలు వ్యవహారం..

జిల్లా కేంద్రంలో ఆగస్టు 15 పేరుతో ప్రభుత్వ పెద్దల సిఫార్సులతో ఇప్పటికే రూ.25లక్షల రంగుల పనులను నామినేటెడ్‌గా తీసుకుని చేసేశారు. మరో రూ.78.26 లక్షల విలువైన పనులను ఆన్‌లైన్‌లో కాంట్రాక్ట్‌లో ఏకపక్షంగా దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కావడంతో శ్రీకాకుళం నగరానికి చెందిన పలువురు కాంట్రాక్టర్లు షెడ్యూళ్లు దాఖలు చేశారు. దీంతో టెండర్లలో పోటీ ఏర్పడింది. ఇవి తెరిస్తే తనకు కాంట్రాక్ట్ రాదేమోనని ఓ వ్యక్తి మిగతా కాంట్రాక్టర్లందరినీ తప్పుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. తప్పుకోకపోతే ఇబ్బందులు పడతారని బెదిరింపులు కూడా దిగుతున్నారు. టెండర్లలో పాల్గొన్న కాంట్రాక్టర్లు తప్పుకోలేదని సెప్టెంబర్‌లో తెరవాల్సిన టెండర్లను నేటి వరకు తెరవకుండా అధికారం అండతో తాత్సారం చేయిస్తున్నారు. తాను తప్ప ఎవ్వరూ టెండర్లలో ఉండటానికి వీల్లేదని, తనకు తప్ప ఎవరికి రంగులు కాంట్రాక్ట్ ఇచ్చే పరిస్థితి లేదని తెగేసి చెప్పేస్తున్నారు. అంతటితో ఆగకుండా కాంట్రాక్ట్ తనకు దక్కకుండానే పనులు చేయాల్సిన చోట పాత రంగులపై తెల్ల రంగు వేసి, కాంట్రాక్ట్ వర్క్‌ను రిజర్వ్ చేసుకున్నానని హడావుడి చేస్తున్నారు.

రకరకాల జిమ్మిక్కులు

ఇటీవల కార్పొరేషన్ పరిధిలో మురుగు కాలువల షిల్ట్ తీసే పనులను చేపట్టారు. ఫేజ్-1, ఫేజ్-2 కింద పనులు చేపట్టారు. ఈ పనులు చేపట్టే కాంట్రాక్టర్లే రంగుల ఈప్రొక్యూర్‌మెంట్ టెండర్లలో కూడా పాల్గొన్నారు. రంగుల టెండర్ల నుంచి సదరు స్థానిక కాంట్రాక్టర్లు తప్పుకోవడం లేదని షిల్ట్ పనులకు సంబంధించి ఎంబుక్‌లు రికార్డు చేయనివ్వకుండా తాడేపల్లిగూడెం వాసి అడ్డు తగులుతున్నారు. రంగుల కాంట్రాక్ట్ నుంచి తప్పుకుంటేనే షిల్ట్ పనులకు సంబంధించి ఎంబుక్‌లు రికార్డులు చేస్తామని పరోక్షంగా బెదిరిస్తున్నారు. అమరావతి పెద్దల జోక్యం, ఓ ఉన్నతాధికారి సిఫార్సుల నేపథ్యంలో అటు షిల్ట్ పనులకు ఎంబుక్ రికార్డు చేయకుండా, అటు రంగుల టెండర్లు తెరవకుండా అధికారులు సైతం జాప్యం చేస్తున్నారు. మొత్తానికి ఈ 'లోకేష్ మనిషి' ముున్ముందు కార్పొరేషన్‌లో షాడోగా వ్యవహరించి పెత్తనం చెలాయించే ప్రమాదం లేకపోలేదు.

బెంబేలెత్తుతున్న అధికారులు..

వాస్తవంగా సెప్టెంబర్‌లో ఆన్‌లైన్ టెండర్లు పిలిచారు. అదే నెల 15కల్లా టెండర్లు తెరవాలి. కానీ తాడేపల్లి గూడెం వాసి చేస్తున్న ఒత్తిళ్ల కారణంగా టెండర్లు తెరిచే ప్రయత్నమైనా అధికారులు చేయడం లేదు. ఓపెన్ చేస్తే ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని భయపడి వెనక్కి తగ్గిపోతున్నారు. సాంకేతిక కారణాలతో తెరవలేకపోయామని సాకులు చెప్పి తప్పించుకుంటున్నారు. అమరావతి పెద్దలతో పాటు ఆయనకు పరిచయం ఉన్న ఓ ఉన్నతాధికారి జోక్యం చేసుకుంటుండటం వల్ల టెండర్ల జోలికి ఇక్కడ అధికారులు పోవడం లేదని తెలుస్తోంది.

టెండర్లు పిలిచిన పనులివీ..

- హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి రిమ్స్ గేటు వరకు పశ్చిమాన గోడకు రంగులకు రూ.8.38లక్షలు
- మిల్లు జంక్షన్ నుంచి సూర్యమహల్ జంక్షన్ వరకు ఫుట్‌పాత్‌లకు రంగులకు రూ.8.32లక్షలు
- ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ గోడలకు పెయింటింగ్ రూ.8.28లక్షలు
- వైఎస్సార్ కూడలి నుంచి బాపూజీ కళామందిర్ వరకు వాల్ పెయింటింగ్‌కు రూ 8.26లక్షలు
- ఆర్అండ్‌బీ డివిజన్ కార్యాలయం నుంచి పీఎస్ఎన్ఎం హైస్కూల్ వరకు గోడకు రూ.8.23లక్షలు
- పసగాడ సూర్యనారాయణ మిల్లు జంక్షన్ నుంచి కలెక్టర్ బంగ్లా రోడ్డువరకు రూ 8.21లక్షలు
- నగరపాలక సంస్థ కార్యాలయం గోడకు రూ. 7.77లక్షలు
- ఆదివారంపేట వద్ద ప్రభుత్వ, ప్రైవేటు గోడలకు పెయింటింగ్స్‌కు రూ.6.67లక్షలు
- సూర్యమహల్ కూడలి నుంచి రామలక్ష్మణ జంక్షన్ వరకు ఫుట్‌పాత్‌లకు పెయింటింగ్ రూ.5.86లక్షలు
- సూర్యమహల్ కూడలి నుంచి మిల్లు జంక్షన్ వరకు రూ.8.24లక్షలు



'పాల ధరలు తగ్గించడం తగదు'



నందిగాం: విశాఖ డైరీ పాడిరైతుల నుంచి సేకరిస్తున్న పాల ధరలను తగ్గించడం తగదని జిల్లా పశుగణాభివృద్ధి, పాడి పరిశ్రమ సంఘం డైరెక్టర్ తమిరె సుగుణమ్మ అన్నారు. శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డైరీ ఫారమ్‌లన్నీ సిండికేట్ అయి పాల ధరను తగ్గించి పాడి రైతుకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా విశాఖ డైరీ వారు తగ్గించిన పాలధరలను పెంచాలని లేదంటే పోరాడతామని తెలిపారు.

జిల్లాలో 392.4 మిల్లీమీటర్ల వాన



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో శుక్రవారం ఉదయం 392.4 మిల్లీమీటర్ల వాన పడింది. మెళియాపుట్టి, సంతబొమ్మాళి, కవిటి, వజ్రపుకొత్తూరు, ఎచ్చెర్లలో ఎక్కువ వర్షం పడింది. సగటున 13.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



ఈ ఫొటో చూడండి. శ్రీకాకుళంలోని మిల్లు జంక్షన్ నుంచి సూర్యమహల్‌కు వెళ్లే రోడ్డులో ఉమెన్స్ కాలేజీ, మున్సిపల్ బాయ్స్, గర్ల్స్ హైస్కూల్ గోడకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023లో రంగులు వేస్తే ఇప్పుడదే గోడపై పాత రంగులు చెరిపేసి కొత్తగా రంగులు వేస్తున్నారు.

ఈ చిత్రం చూడండి. శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కాలేజీపై ఇటీవల వేసిన రంగులివి. ఇదే గోడపై 2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అద్భుతమైన చిత్రాలతో రంగులు వేసింది. ఆ రంగులు చెరిపేసి కొత్తగా మళ్లీ రంగులు వేశారు.





వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్తపేటలో స్మార్ట్‌సిటీ రోడ్డుగా అభివృద్ధి చేయడమే కాకుండా అందమైన చిత్రాలతో ప్రత్యేక రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పుడీ గోడలపై మళ్లీ రంగులు వేసేందుకు టెండర్లు పిలిచారు.

ప్రజల డబ్బేగా..

- కార్పొరేషన్ నిధుల దోపిడీకి ప్లాన్
- 2023లో రంగులు వేసిన చోట కొత్తగా రంగులు వేస్తున్న కూటమి ప్రభుత్వం
- రూ. కోటికి పైగా అనవసర ఖర్చు
- కావాల్సిన కాంట్రాక్టర్‌కు లబ్ధిచేకూర్చే యత్నం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లా కేంద్రంలో అధికార పార్టీ నాయకులు కొత్తరకం దోపిడీకి తెరతీశారు. గత ప్రభుత్వంలో 2023లో రంగులు వేసిన ప్రదేశాల్లోనే పాత రంగులు చెరిపేసి కొత్త రంగులు వేసేందుకు కూటమి ప్రభుత్వం కోటి రూపాయలకు పైగా ఖర్చు చేస్తోంది. ఇది ముమ్మాటి ప్రజాధనం దుర్వినియోగమే. ఎవరి కోసం ఈ రంగులు వేసే పనులు చేపడుతున్నారో పాలకులకే తెలియాలి. తమకు కావాల్సిన కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకు ఇలా మున్సిపల్ కార్పొరేషన్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

నగరాన్ని ఆహ్లాదకరంగా తీర్చి దిద్దే భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మ్యూరల్ పెయింటింగ్స్ (వివిధ ఆకృతులతో కూడిన కుడ్య చిత్రాలను) వేసింది. శ్రీకాకుళం జిల్లా సంస్కృతి ప్రతిబింబించేలా నగరంలోని 33 ప్రదేశాల్లో పరిశుభ్రంగా, అందంగా కనిపించేలా రంగులు వేశారు. ప్రభుత్వ కార్యాలయాల కాంపౌండ్ వాల్స్‌కు, ఫ్లై ఓవర్‌లకు, వంతెనలకు, సెంట్రల్ డివైడర్లకు, కళాశాలలు, స్కూల్స్ కాంపౌండ్ వాల్స్, నగరంలోని పలు వాల్స్‌కు పెయింటింగ్స్ వేశారు. అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం దేవాలయాలు, వంశధార, నాగావళి నదులు, సంగీత, సాహిత్య విశేషాలను తెలియజేసేలా పెయింటింగ్స్ వేశారు. ఈ మేరకు రూ.75లక్షలు ఖర్చు చేశారు.

ఇప్పుడదే ప్రదేశాల్లో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎక్కడైతే అందమైన చిత్రాలతో రంగులు వేసిందో అక్కడే కూటమి ప్రభుత్వం మళ్లీ రంగులు వేసే కార్యక్రమాన్ని తలపెట్టింది. ఇప్పటికే రూ.25లక్షల విలువైన రంగులు వేసేసింది. మరో రూ.78 లక్షలకు పైగా ఖర్చుతో మరికొన్ని చోట్ల రంగులు వేసేందుకు టెండర్లు పిలిచింది. ఇప్పుడా టెండర్లు పెండింగ్‌లో ఉన్నాయి. అమరావతికి చెందిన పెద్దలకు లబ్ధి చేకూర్చేందుకు కార్పొరేషన్ నిధులను ధారాదత్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో వేసిన రంగులు బాగానే ఉన్నాయి. ఇవేవీ రాజకీయ చిత్రాలు కాదు. మన చరిత్రను తెలిపేవే. ఆ స్థానంలో కొత్తగా రంగులు వేయడమే విమర్శలకు తావిస్తోంది.

చతికిలబడింది

విధిరాత మారిందని సంబరపడిన వీధి బడికి మళ్లీ పాత రోజులు వస్తున్నాయి. ఐదేళ్ల కాలంగా ప్రగతి పథంలో పురోగమించిన ఈ వ్యవస్థ ఇప్పుడు తిరోగమన దశకు చేరుకుంటోంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాయకులు బడుల్లో తమ వారిని మధ్యాహ్న భోజన కార్మికులుగా వేసుకున్నారు. ఆయాలను మార్చుకున్నారు. వీలున్న చోటల్లా తమకు అనుకూలమైన వారికి కొలువులు ఇప్పించి అప్పటికే ఉన్న వారిని ఆగమేఘాల మీద తీసివేయించారు. ఇంత చురుగ్గా తొలగింపులు, కేటాయింపులు చేసిన నేతలు నాలుగు నెలలుగా బడుల్లో క్లీనింగ్‌కు రసాయనాలు ఇవ్వలేకపోయారు. మౌలిక సదుపాయాలు లేని చోట్ల వసతులు కల్పించలేకపోయారు. ఆడపిల్లలు అవసరానికి బయటకు వెళ్లే అవస్థ నుంచి తప్పించలేకపోయారు. గురువారం జిల్లాలోని పలు పాఠశాలల్లో 'సాక్షి' నిర్వహించిన పరిశీలనలో ఈ చేదు నిజాలు వెలుగు చూశాయి.



- ప్రభుత్వ బడులపై సర్కారు నిర్లక్ష్యం
- నిర్వహణ ఖర్చులు ఇవ్వని సర్కారు
- సాక్షి పరిశీలనలో వెలుగుచూసిన వాస్తవాలు

కష్టాలు 'దాటాల్సిందే'

మండలంలోని పద్మ గ్రామంలో ఉన్న ఎంపీయూపీ పాఠశాల ముందు మురుగునీరు నిల్వ ఉంది. బడికి వెళ్లాలంటే రోజూ ఈ కష్టాన్ని విద్యార్థులు దాటాల్సి వస్తోంది. దీనిపై స్పందించేవారే కరువయ్యారు. - మెళియాపుట్టి



పద్మ గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల ఎదురుగా నిల్వ ఉన్న మురుగు నీరు

'బయటకు' వెళ్లాల్సిందేనా..?



పైడిభీమవరంలో ట్యాపులు లేని వాష్ బేసిన్లు

పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఇక్కడ వాష్ బేసిన్లు ఉన్నాయి. కానీ ట్యాప్‌లు లేవు. మరుగుదొడ్ల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. గత ప్రభుత్వ హయాంలో ఇదే బడి కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఉందని కితాబునందుకుంది. కానీ నాలుగు నెలలుగా నిర్వహణ లేక చతికిలబడింది. బాలికల మరుగుదొడ్లు బాగోలేకపోవడంతో వారు బయటకు వెళ్లక తప్పడం లేదు. మరుగుదొడ్ల నిర్వహణపై హెచ్‌ఎం శోభారాణి మాట్లాడుతూ నైట్ వాచ్‌మెన్ లేక టాయిలెట్ పైపులు, బేసిన్లు విరిగిపోయాయని చెప్పారు. -రణస్థలం

బాగుపడేదెలా..?



అడుగంటిన టాయిలెట్ల రసాయనాల సీసాలు చూపిస్తున్న ఆయా ఎం. లలిత

మండలంలోని పురుషోత్తపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు బాగుచేసే పరిస్థితి లేకపోయింది. ఈ విద్యా సంవత్సరం పాఠశాల తెరచిన నాటి నుంచి రసాయనాలు సరఫరా చేయలేదు. ప్రస్తుతం పాఠశాలకు కేటాయించిన రసాయనాలు అడుగంటిపోయాయి. రసాయనాలు వచ్చాయని మండల విద్యావనరుల కేంద్రం నుంచి సమాచారం వచ్చిందని, తీసుకురావాల్సి ఉందని పాఠశాల హెచ్‌ఎం ఎస్. శారద తెలిపారు. ఇక్కడ హెచ్‌ఎంతో కలిపి ముగ్గురు ఉపాధ్యాయులకుగాను ఒక ఉపాధ్యాయుడిని బొనమాళి పాఠశాలకు డిప్యుటేషన్‌పై వేశారు. -కంచిలి

నో గ్రాంట్స్



టెక్కలి: మండలంలోని పాఠశాలలకు నిర్వహణ గ్రాంట్ ఇవ్వకపోవడం, మధ్యాహ్న భోజన పథకం నాణ్యత లేకపోవడం, మరుగుదొడ్లు సక్రమంగా పరిశుభ్రత లేకపోవడం, ఆయాలకు వేతనాలు లేకపోవ డం తదితర సమస్యలు వేధిస్తున్నాయి. టెక్కలి మండలంలో మొత్తం 89 ప్రభుత్వ పాఠశాలలకు మే నెల నుంచి నిర్వాహణ గ్రాంట్ నిధులు మంజూరు కాలేదు. అంతే కాకుండా 92 మంది ఆయాలకు రూ.6 వేల చొప్పున ఇవ్వాల్సిన వేతనాలు పెండింగ్ లోఉండడమే కాకుండా వారికి అందజేయాల్సిన క్లీనింగ్ సామగ్రి కూడా ఇవ్వలేదు. చాలా మంది పిల్లల కోసం తల్లులు ఇంటి నుంచే భోజనాలు తీసుకువస్తున్నారు.

మూడు నెలలుగా అవస్థలు..

నందిగాం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గత మూడు నెలలుగా టియిలెట్లు క్లీనింగ్, తరగతి గదుల క్లీనింగ్‌కు అవసరమైన రసాయనాలు, వస్తువులను అందజేయడం లేదు. దీంతో టాయిలెట్ల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నందిగాం, దిమ్మిడిజోల, కవిటి అగ్రహారం, నౌగాం, దేవళభద్ర ఉన్నత పాఠశాలల్లో, కొత్తగ్రహారం, మర్లపాడు, లింగాలపాడు, చిన్ని లవునిపల్లి, నరేంద్రపురం, కల్లాడ, దేవుపురం, దేవళభద్ర ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించి వారి స్థానంలో అధికార పార్టీ అనుకూలురను నియమించారు. నౌగాం, హరిదాసుపురం, దిమ్మిడిజోల, దేవళభద్ర ఉన్నత పాఠశాలల నైట్‌వాచ్‌మెన్‌లను తొలగించి వారి స్థానంలో తమ వారిని వేసుకున్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు వల్ల ఏకోపాధ్యాయ బడుల పరిస్థితి అగమ్యగోచరమైంది.

టీచర్ల కొరత..



ఇచ్ఛాపురం: ప్రభుత్వోన్నత పాఠశాలలో కర్రలను వినియోగించి మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తున్న సిబ్బంది

స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత కనిపిస్తోంది. దీంతో టీచర్లకు పనిభారం తప్పడం లేదు. ఒడియా మాధ్యమం విద్యార్థులకు ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పూర్తిగా లేరు. ఇక్కడ మధ్యాహ్న భోజనానికి గ్యాస్ సదుపాయం లేకపోవడంతో కర్రలు వినియోగించి వంట చేస్తున్నారు. - ఇచ్ఛాపురం

మధ్యలో వదిలేస్తారా..?



అసంపూర్తి నిర్మాణాలతో పూర్ణభద్ర ఎంపీపీ స్కూల్

పలాస మండలం అమలకుడియా పంచాయతీ పూర్ణభద్ర గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితి ఇది. గ్రామంలో వరద గెడ్డ కారణంగా అక్కడ పాత భవనం కూలిపోయింది. గత ప్రభుత్వం కొత్త భవనం పనులు మొదలుపెట్టింది. ఇంతలో ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. కానీ కొత్త ప్రభుత్వం ఆ భవనాన్ని పట్టించుకోవడమే మానేసింది. దీంతో అరకొర నిర్మాణాలు, అందుబాటులోకి రాని మరుగుదొడ్లు, బెంచీలు, పెయింటింగ్‌లు లేని గదుల్లోనే పిల్లలు చదువుకోవాల్సి వస్తోంది. -కాశీబుగ్గ

క్లుప్తంగా

జాబ్‌మేళాలో 21 మంది ఎంపిక



విధి విధానాలు తెలియజేస్తున్న ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శుక్రవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. విశాఖపట్నం, భోగాపురంలోని మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్ ఐఎన్‌సీ, తమ్మినా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్, ఓ ప్రైవేట్ ఛానల్ ప్రతినిధులు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించగా 78 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరిచిన 21 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి వ్యక్తిగతంగా సమాచారం అందిస్తామని కంపెనీల ప్రతినిధులు పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఉరిటి సాయికుమార్, వర్సిటీ ప్లేస్‌మెంట్ అధికారి విద్యాసాగర్ పర్యవేక్షించారు.

గంజాయితో పట్టుబడిన యువకులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని విజయాదిత్య పార్కు వద్ద శుక్రవారం కిలో గంజాయితో నలుగురు యువకులు రెండో పట్టణ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిలో ఒకరు మైనర్. రెండో పట్టణ ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. నగరానికి చెందిన తుపాకుల సువార్తరాజు, సీరపు కౌశిక్, ఓ మైనర్, విశాఖపట్నానికి చెందిన ఎ.సాయిషణ్ముఖతో కలిసి విజయాదిత్య పార్కు వద్ద తచ్చాడుతుండటంతో పోలీసులు అనుమానంతో పట్టుకున్నారు. ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేయగా.. సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

ఆర్టీసీలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభం కానున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించి 18వ బ్యాచ్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లైట్ వెహికల్ లైసెన్స్ ఒక సంవత్సరం అనుభవం కలిగి 21 ఏళ్లు నిండిన వారు అర్హులని తెలిపారు. 40 రోజుల శిక్షణలో మెలకువలు, ట్రాఫిక్ నిబంధనలు తెలియజేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8074640792, 7382923293 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కూనకు మతి భ్రమించింది

- మంత్రి పదవి రాక ఫ్రస్ట్రేషన్‌తో ఏదేదో మాట్లాడుతున్నారు
- వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పరిశీలకుడు తమ్మినేని సీతారాం ధ్వజం



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు మంత్రి పదవి దక్కకపోవడం, పార్టీలో గుర్తింపు లేకపోవడంతో మతిభ్రమించి ఫ్రస్ట్రేషన్‌లో లేనిపోనివి మాట్లాడుతున్నారని మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పరిశీలకుడు తమ్మినేని సీతారాం దుయ్యబట్టారు. ఆమదాలవలసలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో శుక్రవారం ఆమదాలవలస పార్టీ మున్సిపల్, మండల నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుకమాఫియాకు డాన్ కూన రవికుమార్ కాదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నది ఆయన అనుచరులు కాదా అని ప్రశ్నించారు. వాస్తవాలు చెబుతున్న ప్రతిపక్ష నాయకులపై లేనిపోని మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అంటే హుందాగా ఉండాలని, పిచ్చోడిలా గెంతులేయడం ఆపి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవుపలికారు. రవికుమార్ గతంలో వెన్నెలవలసలో 100 ఎకరాల స్థలం ఆక్రమణకు బరితెగించలేదా అని ప్రశ్నించారు. శ్రీకాకుళం–ఆమదాలవలస రోడ్డు నిర్మాణాలు వైఎస్సార్ సీపీ హయాంలో చేయించామని, మిగిలిన భాగం పూర్తి చేయిస్తానని చంద్రబాబు వద్దకు వెళ్లిన రవికుమార్ ఇప్పుడు ఆ పనులు ఎందుకు చేయించలేకపోయారని ప్రశ్నించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తన ప్రాంతంలో సొంత డబ్బుతో రోడ్డు నిర్మాణాలు చేపట్టారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతిపాదించిన బలసలరేవు నిర్మాణం, పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బూర్జ మండలం పెద్దపేటలో అగ్రికల్చరల్ రీసెర్చ్ సెంటర్, సరుబుజ్జిలి మండలం వెన్నెవలసలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, నాగావళి నది తొగరాం నుంచి పొందూరు మండలం రాపాక వరకు రూ.50 కోట్లతో తాగునీరు అందించే ప్రక్రియ కొనసాగింపునకు చర్యలు చేపట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగల ప్రతిపక్షంగా ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేద్దామని తమ్మినేని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఐక్యతగా ఉందామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, నాయకులు బొడ్డేపల్లి నారాయణరావు, గురుగుబెల్లి శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్‌లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మానుకొండ వెంకటరమణ, చల్లా సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రూ.530 కోట్లు స్వాహా చేసిన చంద్రబాబు

విజయవాడ వరద బాధితుల కోసం రూ.530 కోట్లు ఖర్చు చేశామని ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న చెబుతున్న చంద్రబాబు ఆ మొత్తాన్ని స్వాహా చేశారని సీతారాం విమర్శించారు. అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయమంటే.. ఆ పేరుతో బీర్లు సరఫరా చేయడం విడ్డూరమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం గతంలో పోరాడామని మాట్లాడిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే 4,200 మంది స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను తొలగించారని, వారి ఉసురు తగులుతుందన్నారు. వైఎస్ జగన్ హయాంలో వచ్చిన 17 మెడికల్ కాలేజీలను రద్దు చేసి విద్యార్థులకు అన్యాయం చేశారని విమర్శించారు.

పోలీస్‌స్టేషన్ వెనుక చోరీ

- టెక్కలి ఎన్టీఆర్ కాలనీలో ఘటన
- 3 తులాల బంగారం, రూ.60 వేల నగదు అపహరణ



తెరిచి ఉన్న బీరువా

టెక్కలి: టెక్కలి పోలీస్‌స్టేషన్‌కు వెనుక ఎన్టీఆర్ కాలనీ 5వ లైన్‌లో ఓ ఇంట్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరగడం కలకలం రేపింది. గత ఏడాది కూడా అదే వీధిలో ఓ ఇంట్లో ఇదే తరహాలో చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఎన్టీఆర్ కాలనీ ఐదో లైన్‌లో వైదా విశ్వేశ్వరరావు, యమున దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. విశ్వేశ్వరరావు శ్రీకాకుళంలో ఓ సంస్థలో పనిచేస్తుండగా.. యమున జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జీడీఏగా పనిచేస్తున్నారు. పిల్లల్ని తెలిసిన వారి ఇంటి వద్ద ఉంచి ఇద్దరూ గురువారం రాత్రి విధులకు వెళ్లారు. శుక్రవారం ఉదయం మేడపైన ఉన్న ఇంటి యజమాని యమునకు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని, ఏదో అనుమానంగా ఉందంటూ సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమె ఇంటికి చేరుకోగా.. తాళాలను పగులగొట్టి ఉండటం గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి సామగ్రి చిందర వందరగా పడి ఉండటం చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఇటీవల కన్నవారింటి నుంచి తెచ్చుకున్న 20 తులాల బంగారం, తాము దాచుకున్న రూ.60 వేల నగదు పోయినట్లు లబోదిబోమన్నారు. భర్త ఇంటికి చేరుకున్నాక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ రఘునాథరావు, క్రైమ్ సిబ్బంది ఇంటి వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. వారి పరిశీలనలో 3 తులాల నెక్లెస్, రూ.60 వేల నగదు చోరీకి గురికాగా, మిగిలిన బంగారం బీరువాలోనే ఉండడంతో బాధితులు కాస్త ఊపిరిపీల్చుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఇటీవల వరుసగా దొంగతనాలు జరగడం స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

అడ్డగోలుగా ఇసుక దందా



పేరాడ తిలక్

టెక్కలి: అధికారంలోకి వస్తే.. ఉచితంగా ఇసుక ఇస్తామన్న కూటమి ప్రభుత్వం తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత ఇసుక మాట పక్కన పెట్టి సామాన్యుడికి అందుబాటులో లేకుండా ఇసుక దోపిడీలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇసుక రీచ్‌లకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో కూటమి నాయకులు పెద్ద ఎత్తున దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఫిర్యాదులు చేసిన వారిపై దాడులకు తెగబడి అరాచకాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ప్రతీ నియోజకవర్గంలో ఎంతో సులువుగా సామాన్యులకు అందుబాటు ధరలో ఇసుక దొరికేదని తిలక్ గుర్తు చేశారు. ఇసుక రీచ్‌ల టెండర్లు అమరావతి కూటమి పెద్దలకే దక్కేలా చేయడం, టెండర్లను అడ్డగోలుగా రద్దు చేయడం బట్టి ఎంత దోపిడీ జరుగుతోందో అర్థం చేసుకోవచ్చన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం: జిల్లా కస్తుర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో ఒప్పంద(కాంట్రాక్టు), పొరుగుసేవలు(ఔట్ సోర్సింగ్) పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్ట్ వెబ్‌సైట్‌లో ఉంచామని, అభ్యంతరాలు ఉంటే ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సమగ్ర శిక్షా జిల్లా కార్యాలయంలో తెలియజేయవచ్చని డీఈఓ ఎస్.తిరుమల చైతన్య శుక్రవారం తెలిపారు. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు సీఆర్టీ తెలుగు, సోషల్, బయోలాజికల్ సైన్సు, మధ్యాహ్నం అకౌంటెంట్స్, వార్డెన్, పార్ట్‌టైం ఉపాధ్యాయులు పూర్తిస్థాయి ధ్రువపత్రాలతో హాజరు కావాలని, పూర్తి వివరాలకు జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయంలో సంప్రదించాలని డీఈఓ కోరారు.

మురుగునీటిలో మృతదేహం



పునాదుల్లోని మురుగునీటిలో రిషికేశ్ మృతదేహం

టెక్కలి రూరల్: టెక్కలిలోని మండపొలం కాలనీ–4వ లైన్‌లో ఖాళీగా ఉన్న పునాదుల మురుగునీటిలో శుక్రవారం ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడు భూలోకమాత వీధికి చెందిన బాదా రిషికేశ్(43)గా గుర్తించారు. మద్యం మత్తులో ఇటుగా వచ్చి ప్రమాదానికి గురై ఉంటాడని పోలీసులు చెబుతున్నారు. అంతకుముందు రిషికేశ్ మృతిచెందిన విషయం తెలియడంతో కొందరు స్థానికులు మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకువెళ్లి దహన సంస్కారాలు చేస్తుండగా.. పోలీసులు రావడంతో అక్కడే వదిలి వెళ్లిపోయారు. అనంతరం పోలీసులు ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యా పిల్లలు లేకపోవడంతో.. తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి పోలీసులు కేసునమోదు చేశారు.

సాక్షి స్పెల్‌బీకి విశేష స్పందన



విశాఖ స్కూల్‌లో సాక్షి స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



న్యూ సెంట్రల్ స్కూల్ హాల్‌లో సాక్షి స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

- ఉత్సాహంగా పాల్గొన్న బాలబాలికలు
- నేడు సాక్షి మ్యాథ్స్–బీ పరీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ: 2024–25 విద్యా సంవత్సరానికిగాను సాక్షి స్పెల్ బీ పాఠశాల స్థాయి పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఏటా స్పెల్ బీ, మ్యాథ్స్ బీ కాంటెస్ట్‌లను నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఈ ఏడాది కూడా పాఠశాల, జిల్లా, రీజనల్, రాష్ట్రస్థాయిలో నాలుగు విడతలుగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొదటి దశగా పాఠశాల స్థాయిలో జిల్లా కేంద్రంలోని అరసవల్లి రోడ్‌లో ఉన్న శర్వాణి విద్యాలయ పాఠశాల, పీఎన్‌కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్, బ్యాంకర్స్ కాలనీలో ఉన్న విశాఖ స్కూల్, మందస సమీపంలోని కుంటికోటలో ఉన్న కె.నారాయణ స్కూల్ తదితర పాఠశాలల్లో సాక్షి స్పెల్ బీ కాంటెస్ట్ పరీక్ష శుక్రవారం నిర్వహించారు.

1 నుంచి 9వ తరగతి వరకు..

వివిధ కేటగిరిల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాక్షి మీడియా గ్రూప్ జిల్లా ప్రతినిధుల పర్యవేక్షణలో పాఠశాల ప్రతినిధుల సమక్షంలో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలకు ప్రెజెంటింగ్ స్పాన్సర్‌గా 'డ్యూక్స్ వాఫీ', అసోసియేట్ స్పాన్సర్‌గా 'ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్' వ్యవహరించాయి. కాగా సాక్షి అందించిన ప్రిపరేషన్ మెటీరియల్ తమకు ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థులు ఆనందం వ్యక్తంచేశారు. పిల్లల భవిష్యత్ కోసం ప్రత్యేక చొరవ తీసుకుని పరీక్షలు నిర్వహిస్తున్న సాక్షి మీడియాకు విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సాక్షి మ్యాథ్స్ బీ పరీక్ష జరగనుంది.



శర్వాణీ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

యాజమాన్యాల చొరవ..

సాక్షి స్పెల్ బీ పరీక్షలు జరిగిన కేంద్రాల యాజమాన్య ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. శర్వాణీ విద్యాలయ పాఠశాలలో చైర్మన్ అంధవరపు సూరిబాబు ఆధ్వర్యంలో కరస్పాండెంట్ ఏ.ఆంజనేయులు, డాక్టర్ రేఖ పర్యవేక్షించారు. న్యూ సెంట్రల్ స్కూల్‌లో డైరెక్టర్లు పి.శ్రీకాంత్, పి.శ్రీదేవి, ప్రిన్సిపాల్/రిటైర్డ్ డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు. విశాఖ స్కూల్‌లో చైర్మన్ డాక్టర్ కె.మధుసూదన్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం పి.రామారావు, శ్రావణి, పాల్, కె.నారాయణ స్కూల్‌లో కరస్పాండెంట్ గుంటు రోహిణమ్మ, సిబ్బంది పర్యవేక్షించారు.

రణస్థలంలో ప్రొటోకాల్ రగడ

- రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం



సభ్యులకు సర్దిచెబుతున్న పోలీసులు

రణస్థలం: మండల సాధారణ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. ప్రొటోకాల్‌పై ప్రజా ప్రతినిధులు తీవ్రస్థాయిలో దూషణలకు పాల్పడటంతో గందరగోళం ఏర్పడింది. వివరాల్లోకి వెళ్తే.. రణస్థలం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పిన్నింటి రజని అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కోరం ఇంకా రానందున పాత ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తిని సన్మానించేందుకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో రణస్థలం టీడీపీ సర్పంచ్ లేచి ప్రొటోకాల్ ఎవరూ పాటించడం లేదని, సమావేశానికి ఆహ్వానం అందించలేదని విమర్శించారు. దీనిపై రణస్థలం ఎంపీటీసీ ప్రతినిధి మజ్జి రమేష్ మాట్లాడుతూ సన్మాన సమావేశానికి ప్రొటోకాల్ అవసరం లేదని చెప్పగా.. సర్పంచ్ పిన్నింటి భాను మాట్లాడుతూ ప్రొటోకాల్ లేని వ్యక్తులు సమావేశానికి వచ్చి మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఒకరినొకరు నువ్వెంత అంటే నువ్వెంత అనుకుంటూ సమావేశాన్ని రసాభాసగా మార్చారు. విషయం తెలుసుకున్న జె.ఆర్.పురం ఎస్సై చిరంజీవి, సిబ్బంది ఇరువర్గాలకు సర్దిచెప్పారు. ఎంపీడీవో ఈశ్వరరావు చొరవ తీసుకుని.. కోరం లేదని సన్మాన కార్యక్రమం పెట్టామని, అందరికి ఒకేలా ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు పిన్నింటి సాయికుమార్ మాట్లాడుతూ సమావేశానికి వచ్చి వ్యక్తులు మర్యాద పాటించాలని, అందరూ ఒకటేనని, గత సమావేశంలో ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్ వచ్చినప్పుడు ఎంతోమంది ప్రొటోకాల్ లేని బయట వ్యక్తులు వచ్చారని గుర్తు చేశారు. ప్రజా ప్రతినిధులు గౌరవం నిలబెట్టుకోవాలని సూచించారు. అనంతరం పలు శాఖల అధికారులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులపై మాట్లాడారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, తహశీల్దార్ ఎన్.ప్రసాద్, ఎంపీడీఓ ఈశ్వరరావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చోరీ సొత్తు రికవరీ



చోరీ సొత్తు, నిందితులతో పోలీసులు

పొందూరు: మండల కేంద్రం పొందూరులోని తిరుమల బంగారం, వెండి ఆభరణాల దుకాణంలో చోరీకి పాల్పడిన ఇద్దరు మహిళలను శుక్రవారం అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సీఐ పి.సత్యనారాయణ, ఎస్సై వి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 9న పొందూరులోని జ్యువలరీ షాపునకు విశాఖపట్నం అల్లిపురానికి చెందిన షేక్‌బాక్‌బాను, ధనలక్ష్మి అనే ఇద్దరు మహిళలు ఆభరణాల కొనుగోలుకు వచ్చినట్లు నమ్మించి 60 తులాల వెండి పట్టీలను దొంగిలించారు. సీసీ టీవీ ఫుటేజీలో వీరిని గుర్తించిన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ వివరాలు ఆధారంగా మహిళలను గుర్తించి ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ చోరీకి పాల్పడిన వ్యక్తులను, వెండి వస్తువులను విలేకరుల సమావేశంలో ప్రవేశపెట్టారు. చోరీ కేసు త్వరగా పరిష్కరించి, వెండి వస్తువులను రికవరీ చేసినందుకు పొందూరు పోలీసు సిబ్బందిని అభినందించారు.

మీడియా స్వేచ్ఛపై దాడి తగదు

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసిన మీడియా ప్రతినిధులపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు విమర్శించారు. కొన్ని చానెళ్లను ప్రసారం చేయవద్దని, కేబుల్ ఆపరేటర్లపై ఒత్తిడి చేయడం, ప్రసారాలను నిలుపుదల చేయడం, ప్రభుత్వ నిర్ణయాలు వ్యతిరేకిస్తూ వార్తలు రాస్తే ఎడిటర్లు, ఇతర జర్నలిస్టులపై పోలీస్ కేసులు బనాయించడం రాజ్యాంగం ప్రసాదించిన భావ స్వేచ్ఛకు విరుద్ధమన్నారు. 'సాక్షి' పత్రికలో వచ్చిన కథనం ఆధారంగా పత్రిక ఎడిటర్, ఇతర జర్నలిస్టులపై విజయవాడ పోలీసులు కేసు నమోదు చేయడాన్ని ఐజేయూ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఒక కథనం రాసిన జర్నలిస్టులపై గత నెలలో అక్కడ పోలీసులు కేసు నమోదు చేయగా, సుప్రీం కోర్టు ఈ కేసును కొట్టివేసిందని గుర్తు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం జర్నలిస్టులకు భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్టు ఆయన తెలిపారు. మీడియాను అణచివేసే ధోరణిని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.ఈశ్వరరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జగదీష్, చింతాడ అప్పలనాయుడు, స్వామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.వి.మల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సింగూరు శ్రీనివాస్, చిన్నారావు, గరిమెళ్ల ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ఎస్. నవచైతన్య, కోశాధికారి చౌదరి సత్యనారాయణ తదితరులు ఖండించారు.

అవసరం లేని ఎరువులు అంటగట్టవద్దు

- డీలర్లను హెచ్చరించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రబీ సీజన్ (2024–25)కు సంబంధించి రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డీలర్లకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి జిల్లాలోని ఎరువులు, విత్తనాల హోల్‌సేల్ డీలర్లు, ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని దేశించారు. అవసరం లేని, పనికిరాని ఎరువులు రైతులకు అంటగట్టవద్దని స్పష్టం చేశారు. రానున్న సీజన్లో 77,176 హెక్టార్లలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం అంచనా వేశామని, ఇందుకు 40,225 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉంటుందని గుర్తించామని, ప్రస్తుతం జిల్లాలో 9793 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అత్యధికంగా 29,930 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి త్రినాథ స్వామి, జిల్లా కోపరేటివ్ అధికారి బి.నగేష్, డీసీసీబీ సీఈవో వరప్రసాద్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రమణి, హోల్‌సేల్ ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వైశ్యరాజు గోవిందరాజు, పొట్నూరు శ్రీరాములు, బోయిన గోపాల్ తదితరులు పాల్గొన్నారు.